పరిచయం



పేరు	: వారణాసి సూర్యకుమారి
జననం	: 1941, ఏలూరు
తల్లిదండ్రులు	: భాగవతి సుబ్బారావుగారు, సత్యవతిగారు
జన్మస్థలం	: ద్రాక్షారామం
భర్త	: శ్రీ వారణాసి లక్ష్మీ జయప్రదన్ (మేజర్)
పిల్లలు	: నలుగురు

పెద్దఅమ్మాయి డా॥ శోభ - పెద్దల్లుడు - డా॥ బి.డి.సి.ఎన్. ప్రసాద్

చిన్నఅమ్మాయి డా॥ శైలజ - చిన్నల్లుడు - డా॥ ఎస్.వి. రమణ

పెద్దఅబ్బాయి డా॥ పినాకపాణి - కోడలు - డా॥ నాగలక్ష్మి

చిన్నఅబ్బాయి డా॥ చక్రపాణి - కోడలు - డా॥ శ్రీదేవి M.Tech., M.s.,

మనుమలు	: వంశీ, వరుణ్
మనుమరాండ్రు	: నీలోత్పల, మనోజ్ఞ, వర్షిణి, హర్షిణి
రచనలు	: గోవింద శతకము, శ్రీరామ కథాసుధ, సూర్యకిరణాలు (పద్యకవితలు) 'వేణునాదము' (ద్విపదకావ్యము) అముద్రితము, 'మానినీ మానసం' కథానికలు, నవలలు (అముద్రితములు)
పురస్కారం	: 'ఆంధ్రసారస్వత సమితి' ఉగాది పురస్కారం, పద్యరచనకు 2009లో 'సాహితీ మిత్రుల సంస్థ' తరుపున మిత్రులందరు 'కొత్తపూలు' కవితల సంకలనం 'అంకితం యివ్వడం. 'మన బందరు' పుస్తకమునకు గౌరవ సంపాదకత్వం వహించుట.
ఆకాంక్ష	: ఇంకా ఎన్నో ఎన్నో (వ్రాయాలని)

1. ఆంధ్ర సారస్వత సమితి, సాహితీ మిత్రులు, ఉదయ నడక మండలిలలో శాశ్వత సభ్యత్వం
2. ఉదయ నడక మహిళా విభాగం ప్రెసిడెంటుగా, మహిళా మండలిలో వైస్ ప్రెసిడెంట్‌గా సేవా కార్యక్రమాలు నిర్వహించడం.

Printed at : MSR Graphics-9885704424

కవితారామం

వారణాసి సూర్యకుమారి

కవితారామం

(పద్య సుమములు)

శ్రీమతి వారణాసి సూర్యకుమారి

స్థాపితం 1966

ప్రచురణ

ఆంధ్రసారస్వత సమితి

మచిలీపట్నం.

కవితారామం

(పద్య కవితా సంపుటి)

శ్రీమతి వారణాసి సూర్యకుమారి

తొలి ముద్రణ : ఏప్రిల్, 2009

కాపీలు : 500

వెల : రు. 15/-

ప్రతులకు :

శ్రీమతి వారణాసి సూర్యకుమారి

పరాసుపేట, మచిలీపట్నం - 521 002.

కృష్ణాజిల్లా, ఆంధ్రప్రదేశ్,

ఫోన్ : 08672-251741

డి.టి.పి. & ముద్రణ

M.S.R.Graphics, Machilipatnam-9885704424

ప్రచురణ

ఆంధ్రసారస్వత సమితి

మచిలీపట్నం.

కవితారామ లతా సుమాల సోయగం

పద్య కవితకు ఎన్నో నిబంధనలున్నాయి. ఛందస్సును సాకల్యంగా అభ్యసించి, అవగాహన చేసుకోవాలి. సంస్కృత పద దీర్ఘ సమాసాలు వాడినప్పుడే పద్యాలు అందంగా వుంటాయని మన పండితుల అభిప్రాయం. ప్రాచీన కవుల నుండి వచ్చిన వారసత్వం ఇది. వ్యర్థ పదాలు, ఊత పదాలు లేకుండా స్వేచ్ఛగా పద్యాన్ని పరుగెత్తించడం వ్యావ హారిక భాషలో సులభం కాదు. తిరుపతి వెంకట కవుల శైలి, భావకవుల రచనా శిల్పం - పద్యానికి బంగారు ఆభరణాలు. పద్యం చదువుతుంటే శ్రోతల్ని తన్మయులు చేసే "ఇంద్ర జాలం" దాని నడకలో ఉంది.

శ్రీమతి వారణాసి సూర్య కుమారి గారికి కవితారామం కనుల విందుగా ఉంది. రంగు రంగుల పూలు (వివిధ చందో రీతులు), పూల సౌకుమార్యం (పదలాలిత్యం, సులభశైలి), సుమ సౌరభం (భావ సంపద, శిల్ప విన్యాసం) మనల్ని ఆశ్చర్యపరుస్తాయి. శ్రమైక జీవన సౌందర్యం కన్పిస్తుంది. అంటే ఆమె పడిన శ్రమ, ప్రతిభా విశేషాలు ప్రతి పద్యంలోను ప్రతిబింబిస్తున్నాయి.

కొందరు ఒక్క పద్య ఛందస్సు పై మక్కువ చూపుతారు. వృత్తాలలో అక్షర రమ్యత చూపే వారున్నారు. శ్రీనాధునిలా సీనములలో కవితాసార మందించేవారున్నారు. కందాన్ని అందంగా చిందులేయించే వారున్నారు. ఈ రచయిత్రి అన్నింటినీ అలవోకగా వ్రాయడం అలవాటు చేసుకున్నారు. దేశభక్తిని మిత్రులకు శుభాకాంక్షల్ని అభినందనలు వర్ణించేటప్పుడు సీస పద్యాన్ని భావాన్ని కోకిలా రావంలా వర్ణించడానికి మత్త కోకిలను అందచందాల విన్యాసాలకి కందపద్యాన్ని, దీర్ఘ కవితకు ద్విపద నడకను,.... సందర్భాన్నిబట్టి, సమయోచితంగా ఛందస్సును ఎన్నుకోవడం హర్షించదగిన విషయం.

తెలుగు తల్లికి కవితా సుమాంజలి సీసంలో సమర్పించి, సర్వజిత్తు ఉగాదికి స్వాగతం పలుకుతూ... మనలోని మంచిని పెంచమని కోరుతూ సీసములనే ఎన్నుకుంది. " నదులు, గిరులును, తరువులు, నరుల కన్న మించి పరులకై పాటు పడాలని", మంచి భావాన్ని లలిత పదాలలో చెప్పారు (శబ్దాలంకారం)

ముగ్గురమ్మలు వర మీయగా మోక్ష సాధన జరగాలని - 'జన్మ సాఫల్యం' కవితలోను, 'కన్నతల్లి' కవితలో రెండు సీసములనిండా తల్లి దయామృతాన్ని

అందించింది. చిలకలపూడి 'పాండురంగడు' కవితలో కంద పద్యంలో అందంగా "పండరి పుర రంగడు ... మెండుగ నండగ నుండగ నిండుగ పండుగే" యని అక్షర రమ్యతను అలరింపజేసారు. 'చూపులు కలిసిన శుభవేళ కవితలో... సీతారామ కళ్యాణాన్ని హృద్యంగా ద్విపదతో నడిపిస్తూ... "సీతమ్మ కన్నుల సిగ్గు దొంతరలు, సీతమ్మ మోమున చిరునవ్వు సిరులు' ... అంటూ అందమైన భావ చిత్రానికి రూపు కట్టారు.

'పర్యావరణం - పరిరక్షణ' కవితలో మన బాధ్యతను గుర్తు చేస్తూ... "గిరులకు తరువులొప్పు ఆభరణములుగ" అని, "వేదసారము గ్రహియించి విబుధ వరులు, పామరులకు విద్వత్తును పంచు నటుల, సాగర జలము గ్రహియించి జలదములును ప్రాణి కోటికి వర్షము పంచుచుండు" అంటూ వేదసారాన్ని పంచడం... మేఘాలు వర్షించడంతో పోల్చి, ఉపమాలంకారానికి పవిత్రత ఆపాదించి చెప్పడం సముచితంగా ఉంది.

'అరుణోదయం' కవితలో.. తేటగీతి పద్యంలో నుదుట సిందూరమును దిద్దెనో యనంగ, గగనమున అందాల సుందరి కరణినొప్పె. అని ఉత్ప్రేక్షాలంకారాన్ని పోషించారు.

'తరుగని వెత' కవితలో తన స్వీయానుభవ వేదనాభారాన్ని ఆర్ద్రమైన పలుకులలో చెప్పడం సహజంగా ఉంది. రచయిత్రి కుమార్తె... ఆంధ్రా యూనివర్సిటీలో, గణిత శాస్త్ర ఆచార్య పదవిలో ఉండి హఠాత్తుగా మరణించడం... తల్లి గుండెల్లో గూడు కట్టుకున్న విషాదాన్ని వ్యక్తీకరించడం వలన ఆమెకు కొంత ఊరట లభించి ఉండవచ్చు.

'సంక్రాంతి శోభ' కవితలో.. ఒక్క సీస పద్యంలో ... ముగ్గులు, గొబ్బెమ్మలు, బొమ్మల కొలువులు, గంగిరెద్దు-సన్నాయి పాటలు - సంక్రాంతి సందడినంతా వర్ణించడం శోభాయమానంగా ఉంది.

'మత్తకోకిల' ఛందము రచయిత్రికి నల్లేరుపై బండి నడకలా సాగింది. బాల పల్లవ గ్రాస కషాయ కంఠంతో మత్త కోకిల ఆలపించే రీతిని, రచయిత్రి 'మత్తకోకిల' పద్యాలలో పదచిత్రాలలో చూపారు.

"మత్త కోకిల గాన మాధురి మానసమ్మున నిండగా" అంటూ.... ఐకమత్య మహింస, సత్యము లాయుధమ్ములు కోరెదన్" అని వర్ణించారు. 'ఆశలు, ఆశయాలు' కవితలోను, 'జయహో మహిళా' కవితలోను, కృష్ణుని బాల్య క్రీడలను వర్ణించిన 'వెన్నదొంగ' కవితలోను మత్త కోకిల పద్యం హృద్యంగా సాగింది.

కంద పద్యంపై గూడా రచయిత్రికి మక్కువ ఎక్కువ ' గోపికలు' కవితలో రాస క్రీడను వర్ణించడం, 'గౌతమ బుద్ధుడు' కవితలో గౌతముడు సన్యసించిన వరకు కథను సంక్షిప్తంగా, సరళమైన పదాలలో 30 కంద పద్యాలలో వర్ణించడం ప్రశంసించవలసిన విషయమే.

బందరులో కవితల్ని మెప్పించడం భగీరథ ప్రయత్నమే. అయినా 'పద్యరచన'లో కృషి చేస్తే గుర్తింపు తప్పక వస్తుంది. నిరంతర భాషాధ్యయనం, ఆధునిక పద్యకవులైన.. విశ్వనాథ, కాటూరి, పువ్వాడ, జాషువా, కరుణశ్రీ, తుమ్మల వంటివారి ఖండ కావ్య రచనలు చదవడం... ఎంతో ఉపయోగపడుతుంది. పద్యాలు వ్రాయడం ఆపకూడదు. శ్రీమతి సూర్యకుమారిగారు ముందు ముందు ఉన్నతమైన, ఉదాత్తమైన రచనలు చేయగలరని నా ప్రగాఢ విశ్వాసం.

ఆశీస్సులతో....

జెసనారా, సికింద్రాబాద్

శుభాభినందనలు

శ్రీమతి వారణాసి సూర్యకుమారి గారికి కవిత్వం అంటే మక్కువ ఎక్కువ. షష్టిపూర్తి తరువాత కవిత్వ రచన వెలుగు చూడడం విశేషం. పద్య ప్రక్రియ మీద ప్రేమ పెంచుకొని పద్యాలు రాయటం ఇంకా విశేషం.

"కవితారామం" పేరుతో సూర్యకుమారిగారు పద్య కవితల సంపుటిని ప్రచురిస్తున్నందుకు సంతోషిస్తున్నాను. అంతర్జాతీయ సంస్థ ఆంధ్రసారస్వత సమితివారు ఈ ఏడు పద్య కవితా పురస్కారాన్ని శ్రీమతి వారణాసి సూర్యకుమారి గారికిస్తున్న సందర్భంలో సూర్యకుమారిగారిని అభినందిస్తున్నాను. మా "సాహితీ మిత్రులు" సంస్థ కార్యవర్గ సభ్యురాలు సూర్యకుమారిగారు.

ఆంధ్రసారస్వతీ సమితి ఏటా ఇచ్చే వచన కవితా పురస్కారాన్ని ఈ ఏడు సూర్యకుమారిగారు ఇస్తున్నందుకు కూడా ప్రత్యేక అభినందనలు తెలుపుతున్నాను.

డా।। రావి రంగారావు
అధ్యక్షులు
"సాహితీ మిత్రులు" మచిలీపట్నం.

అనుమోదము

అరవయ్యో పడిలో పడిన ఒక గృహిణి గత నాలుగేళ్లలో మూడు గ్రంథాలు వెలువరించటం, అదీ పద్య కవిత్వం కావటం, ఆశ్చర్యకరమైన విషయాలు.

కవిత్వం అబ్బటం పూర్వజన్మ విశేషంగా అంగీకరించి తీరవలసిందే. అది యీ జన్మలో అంకురించి తీగెలై సాగి ఆకుతొడిగి పుష్పించటం – తల్లిదండ్రుల ప్రోత్సాహం, గురువుల మార్గదర్శకత్వం అనుకూలమైన కుటుంబ పరిస్థితులు – వంటి అంశాలపై ఆధారపడి యుంటుంది.

కవిత్వం ఒక భావ ప్రపంచం. దాని కొక స్వరూప మియ్యటం ఒక యజ్ఞం. అదే రచన. దాన్ని రసజ్ఞుల చేరువకు తెచ్చే ప్రయత్నం రచయిత చేయగలిగినా, అది సమర్థంగా చేయగలిగేది సాహిత్య సంస్థలు మాత్రమే.

ఈ రచయిత్రికి తొలి ఆలంబనమైన సంస్థ మచిలీపట్నంలోని "సాహితీ మిత్రులు" కాగా, మలి ఆలంబనం మచిలీపట్నం ఆంధ్ర సారస్వత సమితి అయినందున, ఈ రెండు సంస్థలను ముందుగా అభినందించాలి. "శ్రీ రామ కథాసుధ" పేరిట ఒక పద్యకావ్యాన్ని 2004 ఆగష్టు నెలలోను, "సూర్యకిరణాలు" పేరిట కవితా కదంబాన్ని 2005 జనవరిలోను "సాహితీ మిత్రులు" శ్రీ రావి రంగారావు గారు ప్రచురించి రచయిత్రిని ప్రోత్సహించారు.

ఇప్పుడి "కవితారామ"పు పద్యసుమాలతో ఆంధ్రసారస్వత సమితి ద్వారా రసజ్ఞులకు నవవసంతపు ఆమోదాల్ని అందజేస్తూన్నారు. కవయిత్రి శ్రీమతి వారణాసి సూర్యకుమారి గారు. ఈ గ్రంథానికి అనుమోదాన్ని అందించే బాధ్యత నా పై ఉంచింది మిత్రులు కొట్టి రామారావు గారు.

"కవితారామం" ఇరవైకి పై బడిన ఖండికల పద్య కృతి. వివిధ అంశాలపై వ్రాయబడిన రచన యిది. పొత్తము విప్పగానే దర్శన మిచ్చేది భాష, శైలి. సూర్యకుమారిగారి రచనలో సులభగ్రాహ్యమైన భాష, సులభతరమైన శైలి పాఠకుణ్ణి శ్రమలేకుండా చదివింప జేస్తాయి.

ఆ తరువాత చదువరుల రసజ్ఞతకు పరీక్షపెట్టేవి – కవితా వైశిష్ట్యం, ఛందస్సౌందర్యం. ఈ విషయాలపై దృష్టి సారించేటప్పుడు రచయిత(త్రి) విద్యా పాండిత్య ప్రతిభా సామర్థ్యాలను లెక్కలోనికి తీసికొనాలి. నిజమా? ఏమో?...

"వేదసారము గ్రహియించి విబుధవరులు
పామరులకు విద్వత్తును పంచునటుల
సాగర జలము గ్రహియించి జలదములును
ప్రాణి కోటికి వర్షము పంచుచుండు"

అన్న 'పర్యావరణ పరిరక్షణ' పద్యం చూచినపుడు ఇంత అద్భుతమైన భావాన్ని ఉపమాలంకార భూషితంగా భాషించటానికి ఎంత పాండిత్యం కావాలని ప్రశ్నవేస్తే మనకు సమాధానం వస్తుందా? రాదు. నాలుగయిదు దశాబ్దాలు నాలుగు గోడల మధ్య గృహిణిగా జీవితం గడిపిన ఈ రచయిత్రిని ఈ ఒక్క పద్యం చాలునమ్మా మీ కవిత్వాన్ని నిర్వచించటానికి అని అందామనిపిస్తుంది.

శ్రీమతి వారణాసి సూర్యకుమారిగారిని రచయిత్రిని, కవయిత్రిని చేసినది వారిలోని భక్తితత్త్వం. అందుకు నిదర్శనం వారి తొలి రచన "శ్రీరామ కథాసుధ" లోని కవితాంతరంగ తరంగాలు. ఈ "కవితారామాన్ని" కూడా ఆర్ద్రం చేసిన ఖండికలు "వెన్నదొంగ" "గోపికలు" "పాండురంగడు" ఇత్యాదులు. చిన్ని కృష్ణుని యెడల కవయిత్రి వ్యక్తం చేసిన ఆత్మీయతను ఈ పద్యంలో చూడండి.

"చోరవిద్యను నేర్చి మానసచోరుడైతివె మాధవా!
దొరకాయల నెంగిలైనను దోషమెంచక తింటివే!
కోరిగొంటివి చల్దిముద్దలు గోపబాలుర చేతులన్
చేరి కుబ్జకు రూప మిచ్చియు చేర్చుకొంటివి చెంతకున్"

మత్త కోకిలలపై సూర్యకుమారిగారికి మక్కువ ఎక్కువ. సీస పద్యాలు తేటగీతులు ఎవరికైనా లొంగివస్తాయి. ఆశ్చర్యకరమైన విషయమేమంటే కందాన్ని అందంగా తీర్చిదిద్ది అందెవేసిన కవయిత్రిగా ముద్రవేసికొంటున్నది యీమె అనిపిస్తుంది.

"అంతట ఆరాధనతో

చింతన మోహమ్ము మీర చెప్పిరి చెలులున్

సుంతయు వీడక తమకే

సొంతము కృష్ణుడనంగ శోభిల్లి రటన్."

పద్య కవిత్వాన్ని సామాజిక అంశాలకు కూడ పీఠిక చేసికొన్న సందర్భాలు ఈ కవయిత్రి కవన వనంలో మనం దర్శింపవచ్చు. అందుకొక ఉదాహరణ.

"ఆకలన్నటువంటి కేకలు నాది నంతము చేయగా శోకమన్నది లేకనే

ప్రజ శోభగా వసియింపగా లోక పూజితమై వెలుంగ తెలుంగు భాషను చాటగా

ఐకమత్య మహింస సత్యము లాయుధమ్ముగ కోరెదన్.

రసవత్తరమైన రచన లితోధికంగా చేయటానికి భగవంతుడీ కవయిత్రికి ఆయురారోగ్య భోగ భాగ్యాలు ప్రసాదించాలని ప్రార్థిస్తున్నాను.

పువ్వాడ తిక్కన సోమయాజి

స్వయం కృషికి సముచిత పురస్కారం

'కవితారామం' మా ఆంధ్ర సారస్వత సమితి 36వ ప్రచురణ దీని రచయిత్రి శ్రీమతి వారణాసి సూర్యకుమారి. ఆమె 5వ రచన. ఇది వరకే ఆమె ఒక కథా సంకలనం, 3 కవితా సంకలనాలు, ఒకటి ఇతర రచయిత్రులతో కలిసి ప్రచురించారు. ఇది ఛందోబద్ధమైన పద్య ఖండకావ్యం.

సాధారణంగా పిల్లలు తమ రచనలను తమ తల్లిదండ్రులకు అంకితం ఇస్తారు. యిక్కడ యీ తల్లి తమ జ్యేష్ఠ కుమార్తె కీ.శే. ఆచార్య వి.వి. శోభకు అంకితమిస్తున్నారు. శ్రీమతి శోభ ఆంధ్రా యూనివర్శిటీలో లెక్కల్లో ఆచార్య పీఠ మధిష్టించి ఉండగా దివంగతులయ్యారు. ఇది చాలా బాధాకరమైన, తల్లి తట్టుకోలేని వ్యదా భరిత దృశ్యం. కాని శ్రీమతి సూర్యకుమారి దుఃఖాన్ని దిగమింగి ఆవేదనను అధిగమించడానికి కవిత్వాన్ని ఆశ్రయించారు. దాని ఫలితమే ఈ ఖండ కావ్యము. ఒక ద్విపద కావ్యము, ఇంకా మరికొన్ని త్వరలో వెలువడనున్నాయి.

శ్రీమతి సూర్యకుమారిగారు ఎస్.ఎస్.ఎల్.సి.వరకే చదివారు. దాదాపు 40 సంవత్సరాలు గృహిణిగా పిల్లలను విద్యావంతులుగా, ప్రయోజకులుగా తీర్చిదిద్దారు. వీరి సంతానం నలుగురూ డాక్టరేట్స్.

పద్య వచన కవిత్వం, కథలు వ్రాసి గ్రంథాలుగా ప్రచురించారు. అంతా స్వయంకృషే. స్వయంకృషికి ఈ మధ్యనే వారికి ప్రత్యేక గుర్తింపు వచ్చినది.

ఆంధ్ర సారస్వత సమితి శ్రీమతి కావూరి శ్రీలక్ష్మి ఉగాది పద్య కవిత ప్రతిభా పురస్కారమునకు శ్రీమతి సూర్యకుమారిని ఎంపిక చెయ్యడం జరిగినది. ఇది 19-04-09 ఆంధ్ర సారస్వత సమితి ఉగాది ప్రతిభా పురస్కార ప్రదానోత్సవ సభలో ప్రదానం చేయబడుతుంది. ఆమెకు నా హృదయ పూర్వక అభినందనలు.

ఈ కవితారామం ఆంధ్ర సారస్వ సమితి 36వ ప్రచురణ. సమితి ఇప్పటి వరకూ సభ్యుల రచనలలో 18 కవితా సంకలనాలు, 3 కథా సంకలనాలు, 65 ప్రత్యేక సంచికలు, 3 వ్యాస సంకలనాలు, ఒక జీవిత చరిత్ర, ఒక సిద్ధాంత గ్రంథం, ఒక నవల, రెండు నానీల సంపుటాలు ప్రచురించినది. ఈ ప్రచురణలలోని కవులు రచయితలలో డా॥ శేషేంద్రశర్మ, డా॥ అద్దేపల్లి మల్లాది సూరిబాబు, డా॥ బోయిన ఐ.ఎ.ఎస్., డా॥ ఆర్.ఎస్.వి. రావు, పురాణం సుబ్రహ్మణ్యశర్మ, బీనాదేవి, కవితా ప్రసాద్, ఆచార్య కోట సుందరరామశర్మ, నవీన్, కప్పగంతుల, డా॥ పి.వి. రమణ, సింగరాజు, దేవదాసు, జిసనారా, కొట్టి రామారావు, తిక్కన సోమయాజి, వాడవల్లి విజయలక్ష్మి మొదలైనవారు ఉన్నారు.

'కవితారామం' కు సర్వశ్రీ జిసనార, పువ్వాడ తిక్కన సోమయాజి, డా॥ రావిరంగారావుగారు తమ ఆశీస్సులు అందించారు. వారికి మా కృతజ్ఞతలు. శ్రీమతి సూర్యకుమారి మరిన్ని మంచి రచనలు చెయ్యాలి, చేస్తారని ఆశిస్తూ.... ఆమెను మరోసారి అభినందిస్తున్నాను.

మచిలీపట్నం
3-04-09

కొట్టి రామారావు
అధ్యక్షులు, ఆంధ్ర సారస్వత సమితి

మనసులో మాట

'శ్రీ రామ కథాసుధ' నా మొదటి పద్య రచన. ఛందోబద్ధంగా వ్రాయాలనే ఆసక్తితోనూ, శ్రీరామునిపై గల భక్తితోనూ 'రచన' యందనురక్తితో మాత్రమే వ్రాయడం జరిగింది. విద్వద్వ రేణ్యులకు అంతగా రుచించక పోయినా, అలతి పదాలతో రచన తేలికగా సాగినందువల్ల చాలామంది సులభశైలి అంటూ మెచ్చుకున్నారు. అందుకు నాకు చాలా సంతోషమైంది. మరింత ప్రోత్సాహంతో రెట్టింపు ఉత్సాహం కలిగి 'కవితారామం' అనే పద్య రచనను ముద్రించడం జరిగింది.

అసలు నా పద్య రచనకు గుర్తింపు లభించినది మొదట "ఆంధ్ర సారస్వత సమితి" సంస్థ ద్వారానే 2001లో ఉగాది కవి సమ్మేళనంలో సీసపద్యములు చదువగా 'విశిష్ట బహుమతి లభించింది. గత ఎన్నో సంవత్సరాలుగా పద్యములు వ్రాస్తున్నప్పటికీ మొదటిసారిగా చదవడం అప్పుడే. అప్పటినించే నాకు ఆత్మ విశ్వాసం రెట్టింపైనది. అప్పటి నుంచి ప్రతి సంవత్సరం ఉగాది కవి సమ్మేళనంలో పాల్గొనడం , ఏదో ఒక బహుమతి అందుకొనుట జరుగుతున్నది.

'సాహితీమిత్రులు' సంస్థ ద్వారా డా॥ రావి రంగారావుగారి ప్రోత్సాహంతో పుస్తకావిష్కరణలు జరిగాయి. నా రచనలకు చాలా ప్రోత్సాహం యిచ్చి నన్ను రచయిత్రిగా పరిచయం చేసిన రంగారావుగారికి ధన్యవాదములు. సాహితీ మిత్రులందరూ కలసి 'కొత్తపూలు' అనే పుస్తకాన్ని నాకు అంకితం' ఇవ్వడం జరిగింది. అందుకు వారందరికీ నా కృతజ్ఞతలు.

ఆంధ్ర సారస్వత సమితి అధ్యక్షులు శ్రీ కొట్టి రామారావుగారు-కార్యవర్గ సభ్యులు , శ్రీమతి జి. రాజేశ్వరిగారు ఛందోబద్ధమైన పద్యములు ఈ మధ్యన ఏమైనా రాశారా! ఈ ఉగాదికి అన్నారు. ఒక విధంగా ఈ పుస్తకం ఆవిష్కరింపబడడానికి వారే కారకులు. వారిరువులకూ నా కృతజ్ఞతలు.

గత ఆరు నెలలుగా కాగితం, కలం పట్టలేక స్తబ్దతలో ఉన్న నాకు వారిద్దరూ అలా అడిగిన తర్వాత చైతన్యం కలిగింది. మా పెద్దమ్మాయి డా.వి.వి. శోభ అకాల మరణంతో నైరాశ్యం చుట్టుముట్టి విషాదంలో ఉన్న నాకు మళ్ళీ ఏమైనా రాస్తుంటే ఊరట కలుగుతుందనే ఉద్దేశ్యంతో మొదలుపెట్టాను. మా అమ్మాయికి అంకితం ఇవ్వాలని అనుకున్నాను. ఆంధ్రాయూనివర్సిటి ఇంజినీరింగ్ కాలేజీలో ప్రొఫెసరుగా పనిచేస్తూ అకస్మాత్తుగా మమ్ములనందరిని దుఃఖ సాగరంలో ముంచి వెళ్ళిపోయిన ఆమె పేరు మీద "ఆంధ్ర సారస్వత సమితి" సంస్థ ప్రతియేటా ఇచ్చే ఉగాది

పురస్కారములలో 'వచన కవిత' ప్రక్రియకు ఈ సంవత్సరం స్మారక పురస్కారం ఇవ్వాలనే సంకల్పం కలిగింది. వెంటనే ఆచరణలో పెట్టడం జరిగింది.

అడిగిన వెంటనే అంగీకరించి ఈ పుస్తకమునకు ముందుమాట వ్రాసి ఇచ్చిన శ్రీ జి.స.నా.రా గారికి కృతజ్ఞతా పూర్వక నమస్సుమాంజలి.

చాలా శ్రద్ధ తీసుకుని చిన్న చిన్న పొరపాట్లను సరిదిద్ది ముందు ముందు ఇంకా బాగా వ్రాయాలనే ఆసక్తి కలిగేలా ప్రోత్సహిస్తూ ముందుమాట వ్రాసిన వారికి నా హృదయపూర్వక ధన్యవాదములు.

పాండిత్యమున ఘనతకెక్కిన కవివరేణ్యులు శ్రీ పువ్వాడ తిక్కన సోమయాజిగారు నా యీ పద్య రచనను వచ్చీరానీ మాటలు పలికే చిన్న పిల్లల కవిత్వంలా భావించి ఉండవచ్చు. కానీ అపార కృపా విశేషముతో తమ అమూల్యమైన సలహాలనందిస్తూ రెండు మాటలు వ్రాయమని అర్థించిన వెంటనే వ్రాసి యిచ్చారు. వారికి నా హృదయపూర్వక ధన్యవాదములు, కృతజ్ఞతాపూర్వక నమస్సులు.

తమ అమూల్యమైన కాలాన్ని వెచ్చించి మంచి సలహాలనిచ్చి ప్రోత్సహించినందులకు శ్రీ కె. పాండురంగారావుగారికి నా కృతజ్ఞతాబి వందనములు.

బి.ఇడి. ఎ.జె.కళాశాల ప్రిన్సిపాల్ డా॥ రావి రంగారావుగారు గురుతుల్యులు, సోదరతుల్యులు ఈ పుస్తకమునకు తమ అమూల్య సందేశాత్మకమైన ముందుమాట వ్రాసి ఇచ్చినందుకు చాలా కృతజ్ఞతలు, శుభాశీస్సులు.

ఆంధ్రసారస్వత సమితి అధ్యక్షులు శ్రీ కొట్టి రామారావుగారికి నా ప్రత్యేక కృతజ్ఞతాభినందనలు. మంచి సలహాలనిస్తూ పుస్తకం ఆవిష్కరణ అయ్యేవరకూ ఆయన చాలా శ్రద్ధ తీసుకున్నారు. ఆయన కార్యదీక్షకు నా ధన్యవాదములు.

డి.టి.పి. చేసి, పుస్తకమును అందముగా తీర్చిదిద్దిన ఎమ్.ఎస్.ఆర్. గ్రాఫిక్స్ రాముగారికి నా కృతజ్ఞతలు.

ఆ॥వె॥ ఆట వెలది వ్రాయ అలవాటు కాలేదు
తేటగీతి తోచు తేలికంచు
కాని వాణికృపను కలమతిచతురత
వ్రాయ గలుగుచుండె వరుస నన్ని ॥

సాహిత్యాభిలాషులు 'కవితారామం'లో విరామంగా కూర్చుని కవితా సుమ సౌరభాన్ని ఆస్వాదించగలరని ఆశిస్తున్నాను.

వారణాసి సూర్యకుమారి



అంకితం

తే.గీ. విద్యవినయ వివేకముల్ విధిగనెంచి
మాకు నింట నెల్లరకును మమతపంచి
గణిత శాస్త్రమ్మునగణిత ఘనత గాంచి
కదలి పోయెను దివిలోన పదవిరాగ.

మా పెద్దమ్మాయి
ప్రొఫెసర్ **డా॥ వి.వి.శోభకు**

కన్నీటితో కన్నతల్లి
వారణాసి సూర్యకుమారి



వినాయక ప్రార్థన

తే.గీ. విఘ్నరాజ వినాయక! వేగరమ్ము
పూజసేతుము నినునమ్మి ముదముతోడ,
భక్తిగ వినిపించు మొరల ప్రమథనాథ
వినగ వేడెదమయ్యనిన్ వినుతిసేసి



సరస్వతీ దేవి ప్రార్థన

మత్తకోకిల అమ్మభారతి! నీ కృపన్‌కదునల్పుడైనను పొందునే
ఇమ్మహిన్ ఘనకీర్తి ముందుగనెందుగాంచని రీతిలో
నమ్మినందున శీఘ్రమే నరునాల్కపై నివసింతువే
రమ్మనందువు లక్ష్మినింటికి రాజ్యమేలుచునుండగన్.

తెలుగు తల్లికి కవితా కుసుమాంజలి



1.సీ. తెలుగు తల్లికి నేడు తీయని కవితలను
తెలుగు లెస్సయనగ తెలుపు కొందు
సీసమ్ము శ్రీవాణి చిరుదరహాసమై
ఉరికి వచ్చి కవిత ఉనికి తెలుపు
కందమ్ము నందున బంధించ నుందుమా
కదన కుతూహలం కదము త్రొక్కు
మత్తేభ శార్దూల మత్త కోకిలలన్ని
అంతరములు లేక అందమొలుకు

తే.గీ. తేట గీతిని వినిపించు తేటి గీతి
గద్య కవితల్లుబాళించు కప్పు రమ్ము
ఆట వెలది ద్విపదలు సయ్యాట లాడ
తెలుగు కవిత భవిత పొందు దిగ్విజయము!

2. సీ. తెలుగు కవిత్వమ్ము దేదీప్యమానమై
తెలివితేటలనంత తెలియజెప్పు
తెలుగు పద్యమున యతీ ప్రాస నియమాలు
కవితామతల్లికి కాన్కలగును.
తెలుగు పాటల నుండు దివ్య భావమ్మది
మనసుల నిండుగ మమత నింపు
తెలుగు మాట ల కూర్పు తేటతనమ్మది
కమ్మని చెలిమిని కలుగ నొప్పు

తే.గీ. మాతృభాష మధురిమను మరువ తగదు
వెలుగు నిచ్చు తెలుగు దివ్వె విడువ వలదు
వలస పోయినా సంస్కృతి వదల వలదు
తెలుగు భాషతీయదనము తెలియనగును

సీ. తెలుగు భాషను నిండు తెలుగు తేజమ్మది
తెలుగు వెలుగు దిశ దిశలయందు
పదములొక్కటియైన ప్రతి పదార్థము వేరు
భాష సౌందర్యము పదములందు
అక్షర లక్షల లక్షణ మగుశైలి
భావనల్ పలికించ పలుకులందు
వివిధ ప్రక్రియలను విరివిగ రచనల
భాషామ తల్లికి ప్రణతులందు

తే.గీ. మంచి పద్యము మాతకు మల్లెదండ
గద్యము మినీ కవితలు నైవేద్యమనగ
కథలుగేయ రచనలాది కనక కుసుమ
రాశి నర్చింతు తెలుగు సారస్వతమును

* * * * * * * * *



సాహితీ నిలయం

1. సీ. సంగీత సాహిత్య సభలతో నొప్పుచు
శారదా పీఠమై జ్ఞానమొసగు
సకల శుభమ్ములు శాంతియు నందించు
శివగంగ వాసియై స్థిరముగాను
శీఘ్రమే కరుణించి సిరులను చిందించు
శ్రీలక్ష్మి నిలయమై యలరగాను
ప్రముఖమ్ముగ మచిలీపట్నము కళలకు
కాణాచిగా పేరు గాంచగాను

తే.గీ. ముగ్గురమలు కూడిరి ముచ్చటగను
పొందు రంగడు దీవించు పదిలముగను
దత్తరామేశ్వరుండును దయను చూచు
ఖ్యాతి నార్జించు నిచ్చటి గళము, కలము

సీ. వివిధ వర్ణంబుల విరుల గూర్చి కదంబ
మాలల నర్పించె మాతకనగ
పసిడి పూలకు వచ్చె పరిమళ మన్నట్లు
మేటి రచనలకు సాటిలేక
బందరు నందున బంగరు కవితల
సంపుటుల్ తెచ్చె మా స్థాయి పెంచ
ఆంధ్ర సారస్వత మందున సమితి
సత్కవుల్ పొగడగ సంతసమున

తే.గీ. మంచి పొత్తము లందించి మంచిజేయ
కరుగు కాలమునకుగాని కాసులకును
వెరువకయె సుప్రసిద్ధులన్ వెదకి తెచ్చి
సభకు సందేశ మిప్పించు సంస్థ యగును

సర్వజిత్

సీ. నూతన ఒరవడి నొక్కింత నేర్చిన
నిత్య నూతనముగ నిలువగలము
మాట నిలకడతో పాటకు పల్లవై
మధురముగ మనము మనగ గలము
కక్ష సాధింపులు కార్పణ్యములు లేక
కమ్మగ కాలమ్ము గడపగలము
దూషణ భూషణ దోషము లెంచని
నాడె హాయిగ మది నవ్వగలము

తే.గీ. పరమతమనిన హితమన్న పరులమేలు
కోరుచున్నను తప్పక కూడు మంచి
ఆశయు నిరాశల నడుమ నలమటించు
సర్వులకు నూతన శకమీ సర్వజిత్తు।

సీ. ప్రతిఫల మడుగక ఫల పుష్పముల నిచ్చు
తరులుత్తమంబులు తలపనెపుడు
ప్రతిఫలమనకుండ ప్రవహించి జలమిచ్చు
నదులన్ని మనకంటే నాణ్యమగును
ప్రతిఫల మడుగక బ్రతుకుట కూపిరి
యగుగాలి మనకంటె అధిక తమము
ప్రతి ఫలమడుగకె పంచభూతమ్ములు
ప్రాణులకుపయోగపడును సుమ్ము

తే.గీ. నదులు, గిరులును, తరువులు నరులకన్న
మించి! నిస్వార్థ బుద్ధితో మేలు చేయు
పరులకై తామెపుడుపాటు పడుటె కన్న
మిన్నయన్నది లేదన్న మేలుకొన్న।

జన్మసాఫల్యం

ద్విపద



మానవ దేహము మహిదేవళమ్ము
తానాత్మయై వెల్గు దైవమ్ము అందు
మానవ మేథయు, మదిని దైవాంశ
కానవచ్చును పూర్వ కర్మాను సరణి
స్థిరముగ భ్రుకుటిని శ్రీ శక్తినిలువ
అరయగ కన్నుల నలరారు లక్ష్మి
నరునాల్క వాగ్దేవి నలువ రాణియును
వరుసగ మువ్వురు వరముల నొసగు
ఆ ముగ్గురమ్మలు ఐక్యమైనపుడు
శ్రీ మాతయై ధరన్ శీఘ్రమ్ము బ్రోచు
ఆ శక్తిత్రయము దివ్యమగు తేజమ్ము
విశదీకరించును విధి విధానమ్ము
అహమును, స్వార్థము లనక పరులకు
సహకరించిన వారు సద్గతి నొందు
మహనీయులగు వారు మానవులందు
సహజ విద్యా గుణ సంపన్నులగును
త్రిగుణాత్మకంబైన దేవినినమ్మి
మిగుల భక్తిని గొల్వమెచ్చు నాయమ్మ
హృదయ కమలము సింహాసనమ్ము గను
ముదమునర్పించుటె మోక్ష సాధనము
తనను తాను మరచి తలచిన తల్లి
తనయునికి తెలిపి తరియింప జేయు
కన్నులు తెరచిన కాలమందైన
కన్నులు మూసిన క్షణమందునైన
ఘనమగు భగవతిన్ కనగల్గినపుడె
జనతకు జగతిని జన్మసార్థకము

కన్నతల్లి



సీ. కలిమి లేములనక కడుపు తీపిని పెంచు
గారాలబిడ్డల కన్నతల్లి ।
తనరక్తమును పంచి తరగని ప్రేమతో
కష్టమెరుగ నీదు కన్నతల్లి।
ప్రతిఫలమడుగకె ఫలములిచ్చు తరువు
కాగలదెప్పుడు కన్నతల్లి।
పిల్లల భారము ప్రియమార భరియించ
కాదెభూమాతయా కన్నతల్లి।

తే.గీ. రూప గుణములు తీరుగ రూపుదిద్ది
విద్యవినయ సంపత్తుల వెలుగునిచ్చి
వెదకి నిక్షిప్త శక్తిని వెలికి దెచ్చి
ఖ్యాతి గాంచంగ కోరును కన్నతల్లి ।

॥సీ. ఉగ్గుపాలను నేర్పు ఒడిదుడుకులనోర్పు
ఒద్దికతనమును ఓర్మినమ్మ।
నడకతో బాటుగ నడవడికను నేర్పి
గురువుగ నొప్పును కూర్మినమ్మ।
సమయోచితంబైన సలహాలనందించు
సస్నేహబాంధవి చల్లనమ్మ।
సంస్కారవంతులై సన్మార్గగాములై
తనరగ దీవించు దైవమమ్మ।

తే.గీ. తనదు ఆశయ సిద్ధికై తనివిదీర
బిడ్డల భవితను తలచు ప్రీతినమ్మ।
శక్తి వంచన లేకుండ శ్రమకు నోర్చి
సంతుయున్నతి కాయమ్మ సంతసించు

పాండురంగడు

కం :-



1. బందరునందున సంద్రము
అందరిడెందముల దోచనందము చిందున్
మందిరమందున కందుము
ముందుగ గోవిందు ముగ్ధమోహన మూర్తిన్॥

2. చిలకలపూడిని వరముగ
వెలసి స్థిరముగ నిలిచిన విఠలుని కనగా
కలఫలియించగ తోచును
కలియుగ దైవమున నమ్మకమ్మున గాదె॥

3. కటిపై కరములనిడుకొని
తృటిలో కటకటల బాపి తృప్తిని గూర్చున్
వటపత్రశయను కృష్ణా
తటినతులిడునట్టి వారెధన్యులు ధరణిన్ ॥

4. కోరిన భక్తుల నిలబం
గారపుబాటను నడుపుచు గారడిజేయున్
సారము నెరిగిన సజ్జన
భారము వహియించి తానభయమిడు చుండున్

5. సుందర వదను నరయనర
విందదళాక్షుడన నొప్పు వైభవ శోభన్
అందము చిందుచు చల్లగ
అందరినింబ్రోచు పాండురంగని కనరే ।

6. పండరి పురరంగడు భూ
మండల మేలేటి ఱేడు మా భాగ్యమనన్
మెండుగ నండగ నుండగ
నిండుగ పండుగెయనంగ నిక్కముసుమ్మా !

చూపులు కలిసిన శుభవేళ

ద్విపద

జనక మహారాజు జామాతనెంచ
తనయకు వరునిగ తగువానిగోరె।
శివచాప మెవ్వరు చేరి సంధించు?
అవ్వరునకు నిత్తు అవనిజననియె।
యతికౌశికుని వెంట యాగరక్షణను
అతిరయమ్ముగ జేసె ఆ దాశరధియే
అనుజునితోగూడి అవ్వనమందు
దనుజ సంహారమ్ము తా పూర్తిచేసె
జనకుని కోరిక జానకి సొగసు
ఘనముగ వర్ణించె కౌశికుండపుడు
"సీతా స్వవరణము శీఘ్రమ్ము జరుగు
ఖ్యాతిగాంచుము రామ! కలికికేలంది ।"
కౌశికుబలుకుల కౌసల్యసుతుడు
ఆశీస్సులుగనెంచి అంగీకరించె।
విశ్వమిత్రుని వెంట వినయుడై వెడలె
విశ్వ విభుడుహరి! విస్మయంబదియె।
మిధిలా నగరమంత మిలమిల మెరిసె
పథగామియై రాము పాదమ్ము బెట్ట
మించిన వేడుక తాకెధు మిద్దెల నుండి
కాంచిరి రాముని కనులప్పుజెప్పి
వారి జాక్షులును గవాక్షముల్ తెఱచి
వారినే చూచిరి వాత్సల్య దృష్టి
రామలక్ష్మణులనా రాచ ఠీవిగని
భూమాత మనసంత పులకించెనంత







కార్ముక ధారులు కారుణ్యమొలుక
కూర్మి జూచిరచట గూడిన జనుల
మన్మథరూపులు మదిదోచినంత
తన్మయత్వమ్మున తపియించిరంత
రాచబాటను వీడి రామలక్ష్మణులు
రాచకన్నియ కానరాకయే జనియె
వడివడి నడచెడు వారలకపుడు
కడకొక పూదోట కనిపించె నచట
కుసుమవనంబున గోమలినవ్వ
వసుమతి పులకించె వాత్సల్య మొదవ
శ్రీరామచంద్రుడు సీతకై జూడ
ఆ రామ కన్పట్టె నా రామ మందు
పూబోణులను గూడి పూబంతులాట
శోభ తెచ్చెను సీత సొగసంతనచట
వనితలందరి మధ్య వనదేవత వలె
జనకుని సుత రామచంద్రుని గాంచె
భార్యకా దగినదీ భామయేయనుచు
సూర్యవంశజునకు సుకుమారి తోచె
బాలకుసుమముల పారిజాతమ్ము
వేల తారకలను వెలుగుబింబమ్ము
ఇందు వదన జూసి ఇనకులేశునట
పొందెను సిగ్గును భూషణంబనగ
సుందర రాముడు చూసెనువేడ్క
సుందరి వైదేహి చూపులకలిపి
కోమలి క్రీగంట కోసలేశుగన
రాముడు చిలిపిగ రమణిని గాంచె
విరిశరమును వేసె విరిశరుండంత




యిరువురి మనసులు ఈశుడుకలిపె
శుభతరుణమ్మున చూపులు కలిసె
శుభమస్తు అనిరంత సురలును మునులు
శివ ధనుఃర్భంగమ్ము చేసి మైథిలిని
అవలీలగను బొందె ఆ రాఘవుండు
సీతమ్మ కన్నుల సిగ్గు దొంతరలు
సీతమ్మ మోమున చిరునవ్వు సిరులు
సుదతి రాముని కంత సుమ మాలవేసె
పదుగు రాశీర్వాద ఫలములభించె
కరమును చేబట్టె కలికి జానకిని
గుర్వాజ్ఞ తలదాల్చి కౌసల్య సుతుడు
నళినీ దళాక్షుడు నగుమోమువాడు
భళి భళీ శ్రీరామ భద్రుండు జగతి

* * * * * * * * *



కొత్తపూలు

తే.గీ.



1. కొత్తపుంతలు తొక్కె నీ కొత్తపూలు
కొత్త పరిమళ మందించు కొత్తపూలు
చిత్తమును దోచు రచనలీ కొత్తపూలు
ఉత్తమంబగు రీతినీ పొత్తముండె ॥

2. విత్తమేకాదు ముఖ్యము విద్యకూడ
చిత్తమున హత్తుకొన వీరు చిత్రగతిని
ఉత్తమ రచన నైపుణి ఉట్టి పడగ
మెత్తగా చెప్పినారిందు మేలుకొనగ॥

3. కొత్త కోణమ్ము రచనలు కోరి చేయ
కొత్త పూలు గుబాళించె గొప్పగాను
కొత్తపూలదండను వేయ కోరినంత
అత్తకోడళ్ళు రమ, వాణి అండ నిలిచె

4. చక్కని నవసుమాలకు శారదమ్మ
వరమునిచ్చుట తథ్యము వాడకుండ
కొత్త కలములు కవితల కథనమందు
మేటివారితో సరితూగె తోటివారు

5. గొప్పకవులంత పొత్తమునప్పుజెప్ప
అరకొరగ నేర్చు నజ్ఞాని నైన నేను
భారతీదేవి కరుణకు పాత్రమైతి
దైవమిచ్చును వీరికి దీవెనలను

(కొత్తపూలు పుస్తకమును 'అంకితం' తీసుకొన్నప్పటి స్పందన)

జీవితం

ద్విపదమాలిక

జీవిత మను కథ శీఘ్రమె చదువు
జీవితమను పాట చిన్నగ పాడు
జీవిత మనునాట చెలిమిగనాడు
జీవితమె వరమ్ము చిరునవ్వురువ్వు



కలవోలె జీవితం కలవరపెడితె
తలపెట్టు పనులతో తలనొప్పి వచ్చు
పున్నెమంచును కాశి పోయదమన్న ।
అన్ని బాంబులు పెట్టి హడలగొట్టేరు
సుందర కాశ్మీరు చూడంగ చనిన
అందు కంపించెను అలుకతో భూమి
భూతలస్వర్గము భూతకాలంబె
భీతినిజనులకు ప్రియము కాదయ్యె
అందాల హరివిల్లు అరుదైన నాడు
అందాము నోరార, హరెరామ ! రామ

కం

ఉత్తముడగు భర్త రవిని
చిత్తమునదలచి మురియుచు సిగ్గులమొగ్గై
మొత్తము చదువగ కమలకు
ఉత్తరమున భానుబింబముదయంబయ్యెన్!

(సమస్యాపూరణం)

* * * * * * * * *

తరుగని వెత

తే.గీ. కలత చెందిన మనసుతో కలముపట్టి
కంటినీరనెడు సిరాతో కలము నింపి
వ్రాయగలుగుటె అది యొకమాయ కాని
చదువనక్షర మొక్కటి సరిగలేదు ॥

తే.గీ. తనయపై ప్రేమ వెల్లువై తడిపెనేమొ
చిరువెరపు కడుపు చెరువై చెరిపెనేమొ
జ్ఞాన సంపద యంతచే జారనేమొ
విధియె వక్రించె నీరీతి వింత యేమొ ॥

కం॥ ఎరుగదు పాపము పుణ్యము
కరిగెను ఆయువు తనయకు కారణమేమో
చెరగని ముద్రను వేయుచు
తరగని వెత నాకు నిచ్చె దారుణమేమో

కం॥ లెక్కించ దగిన దానవు
లెక్కల్లో డాక్టరేటు లెక్కలు తప్పె
చుక్కల్లో చేర్చుటకా
ఎక్కడికా దేవుడు నిను ఎత్తుకు పోయెన్


కం॥ అలవాటుగ శోభాయని
పిలుచుచు చెప్పుచు నలుగుర్కు పిల్లలు యంచున్
తలచుచు నిన్నే మదిలో
నలుగుచు నుంటిని దినాకు నరకముగాదే !

కం॥ విన్నది కన్నది ఉన్నది
ఉన్నట్లు చెప్పెదవు నీవు ఉన్నట్లుండీ
నన్నొదిలి వెళ్ళిపోతివె
కన్నా ! నేనేమి చేయగలనే తల్లీ !

పర్యావరణం - పరిరక్షణ




సీ. అడవులు నరికిన అపకారమేయగు
మొక్కలు నాటిన మోదమగును
వృక్షజాతిని అభివృద్ధి పఱచినంత
ఉపకారములు చాల ఉండు మనకు
బొగ్గుపులుసు గాలి బోలెడు గైకొని
ప్రాణవాయువు పంచు ప్రాణులకును
ఫల, పుష్పముల నిచ్చు! పత్రమ్ములిడు నీడ
వినియోగపడుచుండు వ్రేళ్ళు కూడ
తే.గీ. ఔషధమ్మునకు బెరడు అవసరమ్ము
శాస్త్రవేత్తలు, వైద్యులు సమ్మతించె
మనిషి కంటెనుపకరించు మ్రాను మనకు
పుడమికి సహజ సంపదల్ భూరుహములు
సీ. నీలిమేఘమ్ములు నింగినియున్నను
వానకుహేతువు వాయువగును
చల్లని గాలిని చక్కని నీడను
అందించుచును చెట్లు ఆదుకొనును
గీములు కట్టగ బాములు లేకుండ
గట్టిదై నట్టిది కలపనిడును
కడకు మానవుడంత కడతేరుసమయాన
ధరణి రూపమ్మున వేదికగును



తే.గీ. ప్రకృతి పరవశింపగ జేయు పచ్చదనము
మేదినీయలంకారమై మెప్పు పొందు
గిరులకు తరువులొప్పు నాభరణములుగ
ధరణి నీరీతి వృక్షముల్ వరలుచుండు

వేదసారము గ్రహియించి విబుధవరులు
పామరులకు విద్వత్తును పంచునటుల
సాగర జలము గ్రహియించి జలదములును
ప్రాణికోటికి వర్షము పంచు చుండు

అరుణోదయం



తే.గీ

1. కడలిగర్భము నరుణరాగమ్ము నింపి
బాలభానుడు ప్రభవించె ప్రాగ్దిశగన
అలల ఊయెలలూగుచు అరుగుదెంచి
మెల్లమెల్లగా మేదిని మెరుగుపఱచు.

2. దిన కరుని దినచర్యగ దినదినమ్ము
పసిడి కిరణముల్ పుడమిపై పరగినపుడు
నూతనోత్తేజమున తాపసులకు నురుకు
ప్రాణికోటికి మేలు ప్రభాతవేళ

3. నుదుట సిందూరమును దిద్దెనోయనంగ
గగనమందాల సుందరి కరణినొప్ప
నిక్కి జూడుకమలములు నింగిదెసను
అప్పునాదిత్యు గాంచగ ఆర్తి బాయు

4. వెలుగురేఖలు భువిపైన వెల్లి వెరియ
విరియును మురియును ముదమ్ము విరులు ఝరులు
తరువు లాహ్వనమనుచును తలలనూపు
ఆలపించు తీయంగ విహంగ తతులు.

శుభాకాంక్షలు



1.సీ. కృష్ణార్జునులవోలె కీర్తిగడించిరీ
వత్సరమంతయు వడిగవీరు
కలిసిగట్టుగజేసి కార్యకలాపముల్
సామర్థ్యమంతయు చాటినారు
ముందుకంటెను చాల ముఖ్యమైన పనులు
తరువాయి సరిచేయతలచినారు
తిరిగి వారెన్నిక తిరుగు లేదనుచును
దివ్యముగను తీర్చిదిద్దు వీరు

తే.గీ. అర్థికవ్యవహారముల్ హార్దికముగ
స్ఫూర్తిగనిలిచిరిట మనఃస్ఫూర్తిగాను
బంధుమిత్రులు సహకారమందజేయ
జయము సాధించి చూపిరిజగతిమెచ్చ!

తే.గీ. ఉదయ నడకమిత్రులు చేరి ఊరియందు
ఉద్యమించిరి ఆరోగ్య ముందునటుల
నడకపోటీలు జరుపుచు నలుగురికిని
పెంచుచుండిరి ఆసక్తి పెద్దలంత

తే.గీ. విధిగనందరు నడవాలి విరివిగాను
పంచుకోవాలి ఆరోగ్య భాగ్యమంత
మనసు నిర్మలత్వము నొంద మంచి పెరుగు
మెండులాభమ్ము నడకలో నుండుండి అందుకోవాలి ఆరోగ్య భాగ్యమంత
మనసు నిర్మలత్వము నొంద మంచి పెరుగు
మెండులాభమ్ము నడకలో నుండు నిజము !

(ఉదయ నడక మిత్ర మండలి వారిని అభినందిస్తూ)

శ్రీమతి కె. కల్పన పదవీ విరమణ సందర్భంగా

శుభాభినందన పత్రము

సీ. శ్రీమతి కల్పన స్నేహబాంధవి యామె
సరస సంభాషణా చతురురాలు
సాహితీ వేత్తగా సర్వజ్ఞురాలిగా
ముక్కుసూటిగ పోవు ముద్దరాలు
ఉద్యోగ పర్వమ్ము నుత్తమురాలిగా
బహుమతి పొందిన ప్రముఖురాలు
తిరుగులేనట్టిరీతిని రచయిత్రిగా
కవితల నల్లిన ఘటికురాలు

తే.గీ. 1 తానె విధి నిర్వహణకు నాదర్శమూర్తి
సర్వులు సములని తలుచు సహనమూర్తి
హర్ష మొలుక పలుకు దరహాసమూర్తి
పురము నుపకారియ నదగు పుణ్యమూర్తి ॥

తే.గీ. 2 సంఘ సేవనుసలుపుచు సంస్థలందు
పూజ్య భావమ్ము నందుచు స్ఫూర్తినిచ్చు
శిష్యులందరు ప్రేమను చిలుకరించి
మొదమున ఘన కీర్తిని పొగడుచుండ !

తే.గీ. 3 విధిగ బొందిరి యుద్యోగ విరమణనిక
సమయమంతయు రచనలు సలుపగలరు
దైవభక్తియు, ధ్యానము, దైవకృపను
ఆయురారోగ్య ఐశ్వర్యమందగలరు ॥

మైలవరపు రాజేశ్వరి
ఉద్యోగ విరమణ సందర్భంలో
(శుభాకాంక్షలు)

సీ. రాజేశ్వరీ అప్పురాలగు సోదరీ!
మంచి మైత్రికి నీవు మారుపేరు !
దరహాసవదనమ్ము దరిజేరువారల
మన్నన బొందెదు మాటకారి!
తెలుగు భాషను గూర్చి తెలియజెప్పి మరియు
బాలల బోధించు భాగ్యశాలి
తనదైన శైలిలో తరిఫీదు నిచ్చుచు
ఉత్తమశ్రేణిని ఉన్నతముగ

తే.గీ. భావి భారతపౌరుల భవిత నడుప
శక్తి వంచన లేకుండ శ్రమనుపడుచు
పాఠశాలకు ఖ్యాతికై పాటుపడుచు
అవిరళముగ కృషిసలుపు అతివనీవు ॥

సీ 2. చదువుల తల్లియు చల్లగ చూడగ
చదువన్న శ్రద్ధయు చక్కనుండు
విద్యకు తోడుగ వినయమ్ము పసిడికి
తావి యబ్బెనను చందమ్మునుండు
బాంధవ్యమునకును భాష్యమ్ము చెప్పుచు
ప్రియమార నెల్లర పిలుచు చుండు,
కవితలన్న లలిత కళలన్న నాసక్తి
కలిగి కలముపట్టగలిగి యుండె ॥

తే.గీ. ఆది నుండి యణకువయె ఆభరణము
ఆప్తులనభిమా నించుటె అభిమతమ్ము
ఆర్తులకు సహాయపడుటె అగునుమతము
తగిన ప్రతిభతో తనరెడు తరుణి నీవు॥

సీ 3. ఆత్మబలమ్మునె ఆలంబనగ జేసి
కష్టము నెదిరించగలవు నీవు
ఉద్యోగ పర్వమ్ము నుత్తమ ధర్మమ్ము
నిర్వహించిన యట్టి నిపుణమతివి
అంతఃకరణమున అమితమైన కరుణ
ఆత్మ సౌందర్యమె అధిక మనగ
విసుగు చెందక నీవు విశ్రాంతి నెరుగక
విద్య గఱపెడి వివేకమతివి

తే.గీ. ఓర్పు, నేర్పును గూడిన ఒజ్జనీవు
స్నేహబంధము నొప్పుసౌశీల్య వీవు
శిష్యులును బంధుమిత్రులు స్థిరముగాను
వరుసనభిమానమును చూపు వనిత నీవు॥


సీ. ఉద్యోగపర్వము ఓరిమి ముగిసిన
కష్టకాలంబని కలతవలదు
పదవీ విరమణచే ప్రశాంతత లభించు
గురుతర బాధ్యత బరువుతొలగు
కాలవేగమునకు కలవరముండదు
గ్రంధ పఠనమందు క్రమము కలుగు
మెండైన భక్తియునిండైన జీవిక
సాగు శాంతమ్ముగ సంతసముగ

తే.గీ. ఆయురారోగ్య సంపదల్ అతిశయించి
తనర నాదర్శ ప్రాయమై మనగ వలయు
వరములిడ దైవ కృప చేత వర్ధిలంగ
అందుకో శుభాకాంక్షలానంద మొసగ.

సంక్రాంతి శోభ

సీ ముంగిట ముగ్గులు ముద్దు ముద్దుగ వేసి
గొబ్బెమ్మలకు పూజకోరిజేయు
బోలెడురంగుల బొమ్మలు కొలువున
తీరుగనింతులు తీర్చు చంద్రు
సన్నాయిపాటకు సరిగంగి రెద్దాట
సంక్రాంతి సందడి సంబరమ్ము
పంటలు కన్నుల పంటగ పండగ
పండుగ నిండగు పండుగ నగు

తే.గీ. అత్త వారిళ్ళనల్లుళ్ళు అరుగుదెంచ
వరుసనూతనోత్సవము వచ్చునపుడు
పంచభక్ష్యమ్ములను విందు పంచుకొందు
రంత పట్టలేనిముదము స్వంత మగుచు !



నేటి వనిత

<u>ముత్యాలసరాలు</u>

1 గురజాడ చెప్పిరి ఆనాడె
అబలను యిక్కట్లు పెట్టేది
పురుష పుంగవులే సుమాయని
అది మారలేదు నేటికీ

2. ఇంటను బయటా ఎప్పుడైనా
స్త్రీకి రక్షణ కరువైనపుడు
'మానినీమానసం'కుందక
తప్పదు కదా!

3. ఆడుతుపాడుతూ వెళ్ళింది
అమ్మాయి అలవాటు చొప్పున
కానీ కాలం కాటువేసి
విధి వెక్కిరించింది

4 ప్రేమించానని వెంటబడుచు
పెక్కు దినములుగ వేధించుచు
తుదకు దారి అడ్డము కాసీ
అల్లరి పెట్టే నొకండు

5 ఒంటరి తనము ఒక బెరుకైన
తుంటరి మాటల కరకు తనము
మరో వైపు బాధించనామె
ప్రతిఘటించగ సాగె

6 ప్రతి ఘటించిన కొలది పెరిగెను
పట్టుదలయు నాతనిలో నిక
అసమ్మతి నాగ్రహించి పోసె
కన్యమోమున యాసిడ్ ॥

7 ఆనాటి కన్యక అగ్నిలో
దూకెను ఆత్మరక్షణ కోరి
ఈనాటి కన్యక కడదాక
పోరింది ధైర్యముగ

8 అంద విహీన యైకుందెనే
కని ఆప్తులా క్రోశించిరే
చేసిన తప్పుకు మరణశిక్ష
దైవమ్మె వేసె వానికిన్ ।

9 అబలకాదు సబల నేనంచు
వీరనారిగ పోరియు నోడి
పోయెను గాని ఓడిగెలిచెను
నేటి వనిత యగుటన్



ఆశలు - ఆశయాలు

మత్తకోకిల :-

1. మత్త కోకిల గాన మాధురి మానసమ్మున నిండగా
ఉత్తమంబుగ భావ శిల్పము యూగు నూహలనూయలన్
విత్తముండిన లభ్యమాయది విశ్వ సృష్టి విచిత్రమే
పొత్తమందున చిత్రమందున పొంద మీయనుభూతినే ॥

2. సుందరమ్ము వసంతశోభను జూడ మామిడిపూతలే
ముందుగా కను విందు జేయగ ముద్దుకోయిల కూతలే
విందుగూర్చుచు వీనులందున వింతసందడి చేయగా
వందనమ్మిడి విన్నవించెద వంద ఆశలనాశయాల్ ॥

3. ఆకలన్నటువంటి కేకలు నాదినంతము జేయగా
శోకమన్నది లేకనే ప్రజ శోభగావసియించగా
లోకపూజితమై వెలుంగ తెలుంగు భాషను చాటగా
ఐకమత్య మహింస సత్యము లాయుధమ్ములు కోరెదన్ ॥

4. ఈ విరోధినియే విరోధమునెందు కాననితీరులో
సావధానముగా సమస్యలు చక్క బెట్టెడు రీతిలో
ఏ విధమ్మగ నెందు జూచిన యేకొఅంతయునుండకన్
భావి నెల్లరు శాంతి నొందగ భాగ్యమౌను యుగాదియే॥

5. భారతీరమలున్ అపార కృపా విశేషముతోడనీ
భారతమ్మును గాచుచుండగ భావి భారత పౌరులున్
తీరు తెన్నులు మేలు నీతి ప్రతీక లైయట నిల్వగన్
ధీరులంగని సంతసమ్మున దేశమాతయు పొంగదే॥

జయహో మహిళా



<u>మత్త కోకిల</u>

1. ఇంటిలోనను యింటి కావల యింతి పొట్లకు నంతులే
దొంటికాలిని లేచు భర్తను ఓర్పుతోడను నేర్పుతో
చంటి వారికి పెద్ద వారికి చక్కగాను అమరించుచున్
కంటి పాపనువోలె నీవిక కాచుచుందువు మానినీ।

2. అత్త మామల నాదరించుచు ఆడు బిడ్డల ప్రేమతో
క్రొత్త లేకను ప్రీతితోడను కూడి యుండుట నేర్వగా
చిత్తమందున యత్త! తల్లిని చింతనమ్మున సామ్యమున్
ఉత్తమంబగు సంస్కృతిన్ నెలవున్న మేలు లతాంగివే

3. మిన్నునంటెడు వస్తు మూల్యముమేను కంపిల జేయగా
కన్ను మిన్నును కానకుండని ఖర్చులుండగ భర్తతో
మిన్నుకుండకనుద్యమించెదు మెండుగా పొదుపంతటన్
వెన్నుతట్టుచు ధైర్య మిచ్చుచు వెంటనుందువులే సతీ।

4. దాసి వైమరి మంత్రి వైయిక తల్లి వైమహిళామణీ
వాసిగాంతువు నీవె ఆ మగవారి సాటిగ నిల్చుచున్
వ్రాసి చూపిన, విద్యనేర్పిన వాదియైనను గెల్తువే
చూసి మెచ్చగ చేసి చూపుచు శోభ గూర్చు శుభాంగివే

5. అర్థమార్జన చేసి నీవు సహాయ మందగ జేయుచున్
అర్థమర్థ మెరుంగ జేయుచు ఆదుకొందువు ఆపదల్
అర్థ భాగమునాశ్రయించియు ఆక్రమింతువు నంతయున్
అర్థమున్ పరమార్థమున్ ధరనందు కొందువు ధన్యవే!

వెన్నదొంగ



<u>మత్త కోకిల</u>

1. వెన్నముద్దలు దొంగిలించుచు వెన్నుడుండెను కృష్ణుడై
నిన్ను నమ్మిన గోపకాంతలు నీట జేరిన యంతనే
కన్నుగప్పుచుకొమ్మ జేర్చితి కాదె కొమ్మల కోకలన్
మిన్నగా నిను నమ్ము వారిని మెచ్చి దోచెదు చిత్తముల్!

2 సద్దు చేయక దొంగవోలెను చంకనెక్కగ తల్లియున్
వద్దు కాదని లేదు లెమ్మని వంక చెప్పక ప్రేమతో
ముద్దులొల్కెడు మోముగాంచగ మోహమే కలుగుంగదా।
పొద్దుపొద్దును నా యశోదయు ముద్దు జేయుచునుండదే॥

3. తల్లి మానసమంత నిండియు తండ్రి గుండెల నుండియున్
తొల్లి సఖ్యత గూడి మిత్రులతోడ భక్తుల నెల్లరన్
మెల్లగా నెరిగింతువోయన మీదు మిక్కిలి ప్రేమతో
చల్లగా నరుదెంచి మాకిల సంత సమ్మను గూర్చవే।

4. చోర విద్యను నేర్చి మానస చోరుడైతివ! మాధవా।
దోరకాయల నెంగి లైనను దోష మెంచక తింటివే।
కోరికొంటివి చల్ది ముద్దలుగోప బాలుర చేతులా
చేరికుబ్జకు రూపమిచ్చియు చేర్చుకొంటివి చెంతకున్

5. మానసమ్ముల నిల్చి యుండుము మాధవా! మధు సూదనా
మానప్రాణ ధనం బులన్నియు మాకు నీవెరమాధవా!
మానవాళికి యండగా పరమాత్మ యుండగ లోటయా
దాన వారివి కృష్ణ! నీకిల దాసులందుము గావవే!

నేటి భారతం

సీ. భారతమాతకు పలు భాషల ప్రజలు
పలుకును జేజేలు ప్రణతు లిడుచు
బంగరు తల్లికి ప్రజలంత బిడ్డలే
అందరకు మమత అంద పంచు
భాషలు వేరైన భావమొక్కటికాగ
దేశభక్తి వెలయు దివ్యజగతి
సంక్షోభమే లేక సంక్షేమ మలరిన
సంఘ సమైక్యత సంభవించు
తే.గీ. రాజకీయములంచును రభసపడుచు
అంతరంగాల తరాల అంతరాలు
సోదరుల్ తండ్రి తనయులు చోద్యమనగ
పతియు, పత్ని విడివడుట వింతగాదె.
సీ. ఎన్నికలనుచును ఎన్నికలలో కంటు
ఎన్ని కోల్పోదుమో ఎన్నగలమ?
అధికార కాంక్షతో అలజడి కక్షలు
శిక్షలు లెక్కించి చెప్పగలమ?
పార్టీల పేరిట బలియగు ప్రాణుల
గనుచు వారికి వెల కట్టగలమ?
కడుపు కోతకు మించి కన్నతల్లికి బాధ
ఇలలోన వేరొండు ఎంచగలమ?
తే.గీ.ఘోరమగు బాంబులకు బలి కొందరైన
పెను ప్రమాదమ్ములను పోవు జనము కొంత
భావి భారత పౌరులు భవిత లేక
అసువులన్ బాయ కుములు నాయమ్మ గుండె

గోపికలు



కం
1. విరహిణులై గోపికలం
దరు శ్రీకృష్ణునట కోరి తపియించంగా
అరుదెంచెను గోపాలుడు
మురిపించుచు వారినెల్ల మురళీ రవళిన్.
2. తలకొక రూపున తరుణీ
వలయంబున నాట్య మాడి వరుసగ కృష్ణుం
డలకలు దీర్చెను చిర్నగ
వులు చిందించుచును చాల పొలుపు వహించెన్
3. రాకేందు వదనలంతట
మాకేలందు కొనుమంచు । మాకే వేళన్
రాకే నీ పై కోపము
లేకే నటియించుచున్న లేమల మనియెన్
4. నటనను మించిన నటనను
నటియించుచు నారి తేరిన నటన జూపన్
నటియించకు నట శేఖర.
నటనే యైననిదివింత నాటక మనెదన్
5. నిజమో కలయో యెరుగము
నిజముగ నీచెంత నుంట నిజమేయగుచో
నిజ భక్తులమే యగుచో
నిజమగు పుణ్యమ్ము మాది నిజముగ కృష్ణా.
6. అంతట నారాధనతో
చింతన మోహమ్ము మీర చెప్పిరి చెలులున్
సుంతయు వీడక తమకే

గౌతమ బుద్ధుడు

కం



1. శుద్ధోధన రాజ సుతుడు
సిద్ధార్థుడయ్యె విరాగి శీఘ్రముగాంచన్
వృద్ధాప్య జాడ్య మరణము
లిద్దర మానవులకు విధి యిట్టిదనంగన్

2. అవతారమ్ముల నెత్తుచు
సవరించగ జనులనంత సంఘము నందున్
భువనైక ప్రభువు శ్రీహరి
అవని యవతరించె బుద్ధుడై బోధించన్

3. అడవిన్ని ప్రభవించె నతడు
కుడుచుచు నాడి యునుపాడి కూరిమి తోడన్
గడిపెను బాల్యము నంతయు
వడిగను కాలము పరుగిడె వరుసగ నెన్నన్

4. జననీ జనకులు జాతక
మును కోరియడిగిన యంత ముచ్చట పడుచున్
ఘనులౌ జోస్యులు తెలిపిరి
మునికి దగు లక్షణములు ముందుగ నెరుగన్

5. ఘన కీర్తిని పొందగలడు
ఘన జాతకుడైన నిట్టి కారణ జన్మున్
మనసా వాచాపొగుడుటె
మన ధర్మమనిరి ముదమున మరిమరి వారున్

6. మాయా దేవీ తనయుడు
మాయాలోకమున తాను మాయనుబాపన్
మాయా మానుష రూపము
మాయాన్వేషణ జేయగ మహిలో వెలసెన్

7. బాలుడు వలదను రాజ్యము
జాలియు దయగూడ మానసమ్మున తలచున్
మేలగు నహింస యనుచును
కాలము నిష్కామముగను గడపుచునుండున్

8. కోరిక లుండిన ఖేదము
తీరకపోయిన కలుగును తీరిన కలుగున్
వారికి నేరికి తగినది
కోరికలన్నవి జయించ కోరుటె సుమ్మీ

9. అహమును వీడుట నలవడ
ఇహమున సౌఖ్యమును పొందునే విధినైనన్
సహవాసుల యెడ జూపిన
సహనము కొలది సమకూరు శాంతి జనులకున్

10. సున్నిత మైనట్టి మనసు
ఉన్నతమగు నాశయాలు ఉత్తమ రీతిన్
ఉన్నట్టి యతడు కీర్తిని
మిన్నగ దెచ్చును జగతిని మెప్పును పొందున్

11. ధనమందు నాశ లేకను
వన సంచారిగ నతండు వర్ధిలు చుండున్
కనలేడిక కష్టములను
వినలేడనుటయును చూడ వింతగ తోచెన్

12. జోస్యము చెప్పిరి జోరుగ
ఆస్యము చూసియు మరింత హస్తము రేఖల్
జోస్యము హరించె హాసము
హాస్యము కాబోదు జోస్యమని చింతించెన్ ॥

13. పసి వాని భవితను తలచి
వసివాడెను తల్లిదండ్రి వదనములకటా
వ్యసనమ్మున వారంతట
వసియించుచు వాని నింట వదలక పెంచెన్ ॥

14. ఇక్కట్లన్నవి కనబడ
వెక్కడ నెందెందు జూడ నిరవుగ గూర్చన్
చక్కని యేర్పాట్లన్నియు
ఒక్కుమ్మడిగాను జేసె ఓర్పుగ వారున్

15. భీతిని పొందక నింటనె
ఏతావున జూడ సుఖములె యింపుగ జూపెన్
గౌతముని గూర్చి తలచిరి
చూతము తానెటు లెరుంగు చూడకె నిడుముల్

16. సకల గురువులను సఖులను
నికరము గా సేవచేయ నేర్పుగనుంచెన్
సుకరం బాయెను మనుగడ
సకలము సమకూరునంత సంతస మయ్యెన్

17. నేర్చెను శాస్త్రము లన్నియు
నేర్చెను విద్యయు వినయము నీతిని రీతిన్
కూర్చెను సంతృప్తిని ముని
పేర్చెను పెద్దలకు ముదము పెన్నిధి యనగన్

18. మందస్మిత వదనమ్మున
అందము చిందించుకనులు అరవిందములై
పొందిక నమరుట జూడగ
సుందరుడన నొప్పునతడు శోభను గూర్చెన్

19. ఆకర్ణాంత నయనములు
ఆకర్షణ నొప్పు నాసికాగ్రము కనగా
లోకోద్ధర ణార్ధముభూ
లోకమునందుద్భవించె లోకేశుడనన్

20. ఇసుమంత కష్టమెరుగక
పసితనము గతించెతుదకు ప్రాయము వచ్చెన్
కుసుమ శరునివలె నుండన్
వసుధాధిపతియు సుతునకు వధువును వెదకెన్

21. తోచును మంచి తనమ్మున
దోచును మనసుల నతండు తొలిచూపులనే
చూచును నెల్లర ప్రేమగ
సూచన లిచ్చుచు సఖులకు శుభములు గూర్చున్

22. రాజ కుమారుడు మారుడు
ఆ జననీ జనకులుండె నాలోచనలో
పూజల ఫలమున మాత్రమె
ఈ జగతిని కన్య పొందు నీతనిపతిగా॥

23. ధరణీశుడు మెచ్చి యశో
ధరనిచ్చి సుతునకు పెండ్లి తాజరుపగనా
పురవాసులు హర్షించిరి
సురముని గణమెల్లరనిరి శుభమస్తంచున్

24. ఈడుగ జోడుగ నుండియు
తోడుగ నీడగను దంపతులు మురియంగన్
వేడిరి పితరులు మదికా
పాడగ దైవమును భక్తి భావముతోడన్

25. ఆదర్శప్రాయంబై
ఆదంపతులుండ తల్లిదండ్రులు వారిన్
మోదముతో తిలకించిరి,
ఖేదమును వీడి ప్రీతిగ గెలిచిన యట్లున్

26. సంసారమున సరిగమల
హింస నెరుగ నట్టి రీతి యింపుగ నొప్పన్
పుంసా రూపమున పరమ
హంసయె గౌతముడనంగ అలరుచునుండెన్

27. తనయుడు కలుగగ రాహులు
డను పేరును పెట్టిరంత ఆనందముతో
తన లోకమ్మె కుమారుడు
అన సిద్దార్థుండు నుండె అనురాగముతో

28. చెరగని లలాట లిఖితము
అరయగ తరమా యనంగ నప్పుడు జరిగెన్
జ్వర పీడితునిన్ ముదుసలి
మరణము గాంచగ నతండు మమతలు వీడెన్

29. వీడెను భార్యను బిడ్డను
వీడెను సంసారమంత విధి ప్రేరణచే
వీడెను తల్లిని తండ్రిని
చూడగ నెంచెను ప్రజలను సుఖ శాంతులతో

30. బోధించె గౌతముడపుడు
వ్యాధి జరామరణము లను వరుస జయింపన్
బాధే లేని విరక్తియె
సాధన మని బుద్ధుడై ప్రచారము చేసెన్



నివేదన

<u>కం</u>

పల్లవ పాణీ వాణీ
ఉల్లము నందున నిలిచియు నుత్సాహమ్మున్
కొల్లగ శక్తినొసగుమా
యెల్లరు మెచ్చెడు కవితల నింకను వ్రాయన్॥